ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.2, కనిష్ఠం 16.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
సోమవారం 1 జనవరి 2024



జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించినా నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.



లోక్‌సభ ఎన్నికలకు.. కసరత్తు!

- ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
- అధికారులతో ఇటీవల సమీక్షించిన కలెక్టర్
- కొత్త ఓటరు నమోదుకు ఈనెల 5 వరకు అవకాశం
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా విడుదల
- జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 16.13 లక్షల మంది ఓటర్లు
- మొత్తం 2036 పోలింగ్ కేంద్రాలు

కామారెడ్డి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించడానికి సమాయత్తం అవుతుంది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలపై ప్రధాన పార్టీలు సిద్ధమవుతుండగా మరోవైపు అధికార యంత్రాంగం సైతం ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. రెండు నెలల్లో ఎన్నికల ప్రకటన వెలువడుతుందనే సమాచారంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇటీవల పోలింగ్ కేంద్రాల పెంపు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపుపై దృష్టి సారించిన ఎన్నికల సంఘం ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు షెడ్యూల్ జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగంలో ఎన్నికల హడావిడి మొదలైంది. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల గడువు వచ్చే మే నెలలో ముగియనుంది. ఈ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడం కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ముందస్తు కసరత్తును అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500ల మంది ఓటర్లకు మించి ఉండకుండా చూడాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ఓటర్ల సంఖ్యను తేల్చేపనిలో పడ్డారు.

జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 16.13 లక్షల మంది ఓటర్లు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 16,13,176 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులవి 7,90,115 మంది ఓటర్లు ఉండగా మహిళలవి 8,23,272 మంది ఓటర్లు ఉండగా ఇతరులవి 57 ఉన్నాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2036 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

శాసనసభ నియోజకవర్గాల వారీగా ఓటర్లు

కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,52,460 ఉండగా పోలింగ్ కేంద్రాలు 266 ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,20,531 ఉండగా 270 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,99,962 ఉండగా 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,92,841 ఉన్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,70,785 ఉండగా 314 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,31,188 ఉండగా 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆందోల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,45,409 ఉండగా 313 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లోనూ ఓటరు నమోదు

కొత్త ఓటరు నమోదు చేసుకునే వారు ఫారం-6ను నింపి దరఖాస్తు చేసుకోవాలి. బూత్‌స్థాయి అధికారుల వద్ద తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫారం-6ను అందుబాటులో ఉంచారు. అందుబాటులో లేని వారు, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లలేని వారు ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు చేసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సైట్‌ల ద్వారా నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలను నమోదు చేయాలి. ఫొటో, ఆధార్‌కార్డును అప్‌లోడ్ చేసి ఓటు హక్కును పొందవచ్చును. ఈనెల 5వ తేదీ వరకు కొత్త ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా

జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరు నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. ఈనెల 5వ తేదీలోగా వీరు నమోదు చేసుకునేందుకు సమయం ఇచ్చింది. 6న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారు. అభ్యంతరాలు, సవరణల అనంతరం తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8న విడుదల చేసే విధంగా ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను జారీ చేసింది.

దడ పుట్టిస్తున్న చలి



చలి మంటలు కాస్తున్న ప్రజలు

భిక్కనూరు, డిసెంబరు 31: రోజు రోజుకూ మారుతున్న వాతావరణంతో పాటుగా తీవ్రమైన చలి వణికిస్తోంది. తెల్లవారు జామున బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొనగా, గత 15 రోజులుగా ఉదయం తొమ్మిదవుతున్నా పొగమంచు తగ్గకపోగా తీవ్రమైన చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో చలి తీవ్రతతో తెల్లవారినా దుప్పట్లను విడవక, చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సైతం పడిపోతుండటంతో సాయంత్రం ఆరులోపే ప్రజలు ఇంటికీ చేరుకుంటున్నారు. చలి, పొగమంచుకు తోడుగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరం కేసులు పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు జనాలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం వరినాట్లు ప్రారంభం కావడంతో వరి నాట్లు వేయడానికి, పత్తి తీయడానికి కూలీలు రావాలంటే జంకుతున్న పరిస్థితి నెలకొంది. పొగమంచు చలితో ముఖ్యంగా వాహనదారులు, పాఠశాలల విద్యార్థులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి ఎక్కువగా ఉండటంతో గ్రామాల్లో చలి మంటలతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామాల్లో చలి మంటలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాగా ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతుండటంతో జాగ్రత్తలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.



భిక్కనూరులో కమ్ముకున్న పొగమంచు

వైభవంగా అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవం



కామారెడ్డిలో అయ్యప్ప స్వామి ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న స్వాములు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి 34వ మండల పూజ మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గణపతి హోమం, ఉషఃపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి స్వామి వారి ఆభరణాలను పట్నం రమేష్, పట్నం నరేష్, పట్నం గోపాల్ స్వాములు, అయ్యప్ప మాలధారులు సింగారి మేళంతో పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తు పట్టణ ప్రధాన వీధుల గుండా తిరిగి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల సహకారంతో తయారు చేసిన సుమారు 45 తులాల అయ్యప్ప బంగారు కిరీటాన్ని అయ్యప్పస్వామికి పట్టాభిషేకం చేసి తొడిగించారు. సహస్ర కలశాభిషేకం, విశేష ఆభరణములతో స్వామి వారికి అలంకరణ, సర్వబలి, హారతి, పడిహారతి, సాయంత్రం దీపాలంకరణ, అయ్యప్ప స్వామికి చక్రస్నానం, ధ్వజారోహణ కార్యక్రమం, పుష్పాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. కేరళ సహాయ అర్చకులు ఉన్ని కృష్ణన్ నంబుద్రి, ఆలయ వ్యవస్థాపకులు గుడిపాటి చంద్రశేఖర్ శర్మ, వేదపండితుడు గంగవరం ఆంజనేయశర్మ, ఆలయ అర్చకులు కన్నయ్య, వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది మండల పూజ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. పూజ కార్యక్రమాలకు భక్తులు భారి సంఖ్యలో తరలివచ్చి అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్పసేవాసంఘం సభ్యులు, అయ్యప్ప అన్నదాన సేవాసమితి, అన్నప్రసాద సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో..



కామారెడ్డిలో స్వీట్‌హోం వద్ద ప్రజల సందడి

- 2024కు స్వాగతం పలికిన జిల్లా వాసులు
- ఆదివారం రాత్రి నూతన సంవత్సరం సందడి జోరు
- కిటకిటలాడిన స్వీట్ హోమ్‌లు, హోటల్స్, బేకరీలు, వైన్సులు
- కొత్త సంవత్సరంలో అంతామంచే జరగాలంటున్న అన్ని వర్గాల ప్రజలు
- కొవిడ్ మరోసారి రావద్దని కోరుకుంటున్న వ్యాపారులు, ఉద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటున్న యువత, నిరుద్యోగులు
- జనంలో ఉండేలా ప్రణాళిక చేసుకుంటున్న రాజకీయ నాయకులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 31: ఎన్నో ఆశలు.. ఎన్నెన్నో తీపి గుర్తులు.. మరెన్నో చేదు అనుభవాలకు ముగింపు పలుకుతూ.. జీవితం సాఫీగా సాగాలనే లక్ష్యాలతో కామారెడ్డి జిల్లా ప్రజానీకం ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత 2024 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఇటీవల మళ్లీ కరోనా మహమ్మారి కొత్త వేరియంట్‌తో మరోసారి విజృంభించకుండా కొత్త సంవత్సరం మరింత సాఫీగా సాగిపోవాలంటూ చిరు వ్యాపారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. కాలం కలిసివచ్చి పంటల ఉత్పత్తులకు మంచి మద్దతు ధర లభించాలని రైతన్నలు కోరుకుంటున్నారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన ఈ ఏడాదిలోనూ స్థానిక సంస్థలు, లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో రాజకీయ నాయకులంతా జనంలో ఉండి వారి నమ్మకాన్ని పొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇక యువత శనివారం పలుచోట్ల అర్ధరాత్రి వేళ టపాకాయలు పేలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ, కేక్‌లు కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

కొత్త ఏడాది.. కొత్త ఆశలు

2024 కొత్త సంవత్సరంపై జిల్లా వాసులు ఎన్నో కొత్త కొత్త ఆశలు పెట్టుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో కరోనా మరోసారి తన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో గత పరిస్థితులు ఈ ఏడాదిలో రావద్దని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కొత్త ఏడాదిలోనైనా నూతన ప్రభుత్వంతో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో యువతి, యువకులు, నిరుద్యోగులు ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ఆశిస్తున్నారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోని రైతాంగానికి సాగు నీరు అందించేందుకు కాళేశ్వరం 22 ప్యాకేజీ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లాలో కొత్త కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని యువత ఆకాంక్షిస్తోంది. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, దోపిడీలు హత్యలు, ఆత్మహత్యలు లేకుండా చర్యలు తీసుకునేందుకు పోలీసుశాఖ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించుకుంటుంది.

మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రాజకీయ పార్టీలు


ఈ కొత్త ఏడాదిలోనే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో మరోమారు ప్రజాక్షేత్రంలో ఉండేలా రాజకీయ పార్టీలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలో గతంలో ఏక చత్రాధిపత్యం సాగించిన బీఆర్ఎస్ పార్టీకి జిల్లాలో ఒకే నియోజకవర్గానికి పరిమితం కావాల్సి వచ్చింది. రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, మరో నియోజకవర్గంలో బీజేపీ గెలుపొంది బీఆర్ఎస్ దూకుడుకు కళ్లెం వేసింది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా కార్యాచరణను అమలు చేసేందుకు కాంగ్రెస్ నాయకు లు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

జిల్లాలో కొత్త సంవత్సర సందడి

జిల్లాలో కొత్త సంవత్సరం సందడి నెలకొంది. ఆదివారం రాత్రి పాత సంవత్సరానికి గుడ్ బై చెప్పి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జిల్లాలోని యువత, ప్రజలు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రాలు, ఆయా మండల కేంద్రాలలో బేకరీలు, వైన్సులు, స్వీట్ హోమ్‌లు, హోటల్స్ వద్ద సందడి నెలకొంది. హోటళ్ల నిర్వాహకులు ప్రత్యేక ఆఫర్లతో సందడి చేశారు. ఫ్యామిలీ ప్యాక్‌తో హోటళ్ల నిర్వాహకులు ఒకరి కంటే ఒకరు ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించారు. అలాగే స్వీట్ హోంలు, బేకరీల నిర్వాహకులు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు కూడా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. జిల్లా కేంద్రంలో ప్రజలు ఎంతో జోష్‌తో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ప్రత్యేక మందు, విందుతో కేరింతలతో ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. 2024 కొత్త సంవత్సరం సందర్భంగా వ్యాపారాలు కలిసి వస్తాయని భావించిన హోటల్స్ స్వీట్ హోమ్‌లలో సందడి నెలకొంది. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో కొత్త సంవత్సరంను స్వాగతిస్తూ నేడు సందడి చేయనున్నారు. సోషల్ మీడియాలో వినియోగదారులు రాత్రి వేళల్లో తమ సందేశాన్ని మిత్రులకు పంపి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి

● వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే, కామారెడ్డి



కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికే అహర్నిశలు కృషి చేస్తాం. నియోజకవర్గాన్ని అవినీతి రహితంగా మార్చడమే ప్రధాన ఎజెండాగా ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించాం. అదే ఎజెండాతో ప్రణాళికలు తయారు చేయడంతో పాటు యువత, రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ నియోజకవర్గానికి రాష్ట్రంలో మంచి గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తాం. జిల్లా, నియోజకవర్గ ప్రజలకు 2024 ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు.

ప్రజలు తమ లక్ష్యాలను చేరుకోవాలి

● పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, బాన్సువాడ



ప్రజలు తమతమ రంగాల్లో విజయాల సాధించి తమ లక్ష్యాలను చేరుకోవాలి. తగు జాగ్రత్తలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలి. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఎల్లారెడ్డి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

● మదన్ మోహన్‌రావు, ఎమ్మెల్యే, ఎల్లారెడ్డి



నూతన సంవత్సరం నుంచే ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం. ప్రజలకు ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రతీ పనిని చేసేలా చూడడంతో పాటు అధికారులను, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తా. ప్రజలు ఈ నూతన సంవత్సరం వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను.

ఘనంగా సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు

మోర్తాడ్, డిసెంబరు 31: మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం మోర్తాడ్‌లో ఉదయం ప్రజాభవనంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జ్యోతిబా పూలే పాఠశాలలోని విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, తీగెల సంతోష్, మనోహర్‌రెడ్డి, పుప్పాల అశోక్, అర్గుల రమేష్, కుదురుపాక ప్రవీన్, జైడి గంగారాం, నజీర్, జక్కం అశోక్, సుదీర్‌నాయక్, గురువయ్య, రాజేందర్, పాలెం, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో వికసిత భారత్ ప్రచారం

డిచ్‌పల్లి, డిసెంబరు 31: కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ గత పదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం కోసం తీసుకున్న పథకాలను వివరిస్తూ ఆదివారం సుద్దపల్లి గ్రామంలో వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పానుగంటి రూప సతీశ్‌రెడ్డి హాజరై గ్రామంలో 2024 నూతన బీజేపీ క్యాలండర్‌లను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ద్వారానే పేద ప్రజలకు ఉన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోషం, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.85వేల నగదు, 20సెల్‌ఫోన్లు స్వాధీనం

ఖిల్లా,డిసెంబరు 31:పేకాలస్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రెండు వేర్వేరు చోట్ల దాడులు చేసి మొత్తం రూ.85వేల నగదు, 20సెల్‌ఫోన్లు స్వా ధీనం చేసుకున్నారు. కచ్చితమైన సమాచారం మేరకు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఆదేశాల మేరకు అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (లా అండ్ ఆర్డర్) జయరాం నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖరరాజు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు సిబ్బందితో రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో, నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ల పరిధుల్లో దాడులు చేశారు. ఈదాడుల్లో పేకాట ఆడు తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుకు రూరల్ పోలీసు స్టేషన్ పోలీసులకు, మూడో టౌన్ పోలీసులకు అప్పగించారు.

యువతి అదృశ్యం

బోధన్ రూరల్, డిసెంబరు 31:బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన గోదావరి అనే యువతి శనివారం కాలేజీకి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చుట్టూ పక్కల, కుటుంబ సభ్యుల ఇళ్లలో వెతికినా యువతి ఆచూకీలభించలేదని పేర్కొన్నారు. యువతి తండ్రి సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని, సీసీ పుటేజీల ద్వారా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డూప్లికేట్ ప్రొసీడింగ్‌లు ఇచ్చి ఓట్లు దండుకున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి

భీమ్‌గల్ రూరల్, డిసెంబరు31: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల ముందు డూప్లికేట్ ప్రొసీడింగ్ కాపీలను అంటగట్టి ప్రజలనుంచి ఓట్లు దండుకున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి ఆరోపించారు. ఆదివారం భీమ్‌గల్, వేల్పూర్ మండలంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇచ్చినటు వంటి పనులపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పనులు జరగకుండా ఆపుతుందని అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచరులు ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమలో ఉన్నారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హాయాం లో జరిగిన ప్రతి ఒక్క అవినీతిని, భూదందాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ బయట పెడతారనిస్వామి అన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, దామోదర్ గౌడ్, మజీద్, నవీన్, పల్లె శేఖర్,నల్లూరి శీను, కుర్తీలాల్, సేవాలాల్ మండల కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎఫ్‌సీఎస్ ఆధ్వర్యంలో చేపలు విక్రయం

మోర్తాడ్, డిసెంబరు31: మండల కేంద్రంలో ఆదివారం ప్రాథమిక మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు చేపలు విక్రయించారు. స్థానిక సర్పంచ్ బోగ ధరణి ఆనంద్, వీడీసీ చైర్మన్ జేసి గంగారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. మహిళా అధ్యక్షురాలు మగ్గిడి లక్ష్మీబాయి మాట్లాడుతూ ఎఫ్‌సీఎస్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు నాణ్యమైన చేపలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఎస్ మహిళా అధ్యక్షురాలు మగ్గిడి లక్ష్మీబాయి, మహిళ డైరెక్టర్లు సులోచన, లలిత, శ్రావణి, లావణ్య, శ్యామల, అనసూ య, సంఘ సభ్యులు సంగీత, లక్ష్మి, అక్షర, నిర్మల, రజిత, ఉమ, గంగపుత్ర సంఘ సభ్యులు కవి, అంజయ్య, శశి, మగ్గిడి శంకర్, గంగామోహన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


చేపల వ్యాపారం ప్రారంభించిన ఎఫ్‌సీఎస్ మహిళలు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు నగర చిన్నారి ఎంపిక

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: మూడేళ్ల చిన్న వయస్సులోనే స్కూల్‌కు వెళ్లకుండానే ఇంట్లోనే ఉంటూ విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించిన నగరానికి చెందిన బాన చైత్ర అరుదైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్ అవార్డును సాధించింది. నగరంలోని గాయత్రీనగర్‌కు చెందిన చైత్ర 17 జాతీయ పండుగలను, 12 జాతీయ గుర్తులను, 13 అంతరిక్ష వస్తువులను, 26 శరీర భాగాలను, 26 రకాల జంతువులను, 22 రకాల కూరగాయలను, 21 పండ్లను, 13 రంగులను, 8 రకాల ఆకారాలను, 26 అల్ఫాబిట్‌లకు సంబంధించిన వస్తువులను, 11 ఇంగ్లీష్ రైమ్స్‌ను ధారళంగా తడబడకుండా చెప్పేప్రతిభ కలిగి ఉంది. చిన్నారి ప్రతిభను గుర్తించి ఐబీఆర్ సంస్థ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రతిభను చూసి ఈ అవార్డును అందజేశారు.



ఇండియా బుక్ రికార్డ్స్ అవార్డు పొందిన చైత్ర

వేడెక్కిన మున్సిపల్ రాజకీయం

● క్యాంప్‌లకు వెళ్ళిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు
● బీజేపీ కౌన్సిలర్‌లదే ప్రధానపాత్ర
● అవిశ్వాస పరీక్ష నెగ్గేనా..? వీగేనా..?



మున్సిపల్ కార్యాలయం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు31: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్‌పై పెట్టిన అవిశ్వాస పరీక్ష జనవరి 4న ఉండడం తో కౌన్సిలర్‌ల మద్దతు కొరుతూ రాజకీయం వేడెక్కింది. సపక్షంలో విపక్షం ఏర్పడడంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 24మంది కౌన్సిలర్‌లు డిసెంబరు 12న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాసం పెట్టాలని వినతిపత్రం అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ జనవరి 4వ తేదీని ఖరారు చేస్తూ ప్రతీకౌన్సిలర్‌కు నోటీసులు అందజేశారు. 13 నెలల పదవి కాలం ఉండడంతో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సహకారంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు వన్నెల్‌దేవి లావణ్య, ఖాందేశ్ సంగీతలు చైర్‌పర్సన్ సీటును ఆశిస్తున్నారు. అవిశ్వాసం విగిపోకుండా నెగ్గాలనే సంకల్పంతో మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచన మేరకు ఇద్దరు కౌన్సిలర్‌లు ఒక్కటై తమకు మద్దతు ఉన్న కౌన్సిలర్‌లతో క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఇదీలా ఉండగా అవిశ్వాస పరీక్ష కొరకు జిల్లా కలెక్టర్‌కు కౌన్సిలర్‌లు నోటీసులు అందిస్తున్నప్పటి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పవన్ తమకు మద్దతుగా ఉన్న కౌన్సిలర్‌లతో క్యాంప్ నిర్వహిస్తున్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతతో కలిపి ఎనిమిది మంది కౌన్సిలర్‌లు ఉండగా చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 20మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. ఇద్దరు కౌన్సిలర్‌లు ఏటు మద్దతు తెలుపకుండా అవిశ్వాస పరీక్ష రోజే ఆలోచిస్తామని అంటున్నారు. దీంతో జనవరి 4న ఉన్న అవిశ్వాస పరీక్షకు బీజేపీ కౌన్సిలర్‌లదే ప్రధానపాత్ర ఏర్పడింది. మొన్నటి వరకు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, మరిది పనితీరును వ్యతిరేకించిన కౌన్సిలర్‌లు ఎవరికి మద్దతుగా నిలుస్తారోనని, తమ వార్డులలో అభివృద్ధి కుంటు పండుతుందని, ఎన్నో సమావేశాలను బహిష్కరించినవారు ఇప్పుడు ఏటువైపు ఉంటారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అలాగే 2022 జనవరి 25న ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై దాడి ఘటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ మరిది పండిత్ ప్రేమ్ ఉన్న వీడియో బీజేపీ సోషల్ మీడియాలో వైరల్‌గా వస్తోందని వాటిపై కార్యకర్తలు సైతం కామెంట్లు పెడుతున్నారనే సమా చారం. ఈ అవిశ్వాస పరీక్షకు బీజేపీ కౌన్సిలర్ లు మద్దతు తెలుపుతారా లేదా కార్యకర్తలు సైతం ఎదురు చూస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తి వద్ద కత్తి లభ్యం

● రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బోధన్ రూరల్, డిసెంబరు 31: బోధన్ పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఫైజల్ అనే వ్యక్తిని పోలీసులు విచారించి తనిఖీ చేయగా అతని వద్ద ఒక పదునైన కత్తి లభించిందని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. శనివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరగడంతో అతడి వద్ద నుంచి కత్తి లభ్యం కావడంతో అతడిపై కేసు నమోదు చేసిరిమాండ్‌కు తరలించామన్నారు. కత్తితో ఇతరులకు భయభ్రాతులకు గురి చేస్తున్నాడన్నారు. అదే విధంగా పట్టణంలో ప్రతిరోజూ రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగు తోందని, అనుమానాస్పద వ్యక్తులుసంచరిస్తే ప్రజలు పోలీసులకు స మాచారం అందించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్క రు కృషి చేయాలన్నారు. కత్తితో తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టు కోవడంతో ఎవరికైనా ప్రాణాపాయం తప్పిందని స్థానికులు పేర్కొంటు న్నారు. పోలీసుల పనితీరును బోధన్ ఏసీపీ అభినందిం చారు.

నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, డిసెంబరు 31: తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరం ప్రతి ఒక్కరికీ శుభాలు చేకూర్చాలని ప్రతీ కుటుంబంలో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు.

ఖతర్‌లో గుండెపోటుతో వెంకట్ మృతి



మోపాల్, డిసెంబరు 31: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన వేముల వెంకట్ శనివారం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. 18 ఏళ్ల క్రితం బతుకు దెరువు కోసం వెంకట్ ఖతర్ దేశానికి వెళ్లాడు. వెంకట్ కుటుంబాన్ని పోషించేందుకు బతుకుదెరువు కోసం ఖతర్ దేశానికి వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు. ఇతడికి భార్య స్వరూప, కొడుకు శ్రీనివాస్, కుమార్తె ఈశ్వరి ఉన్నారని తెలిపారు. మృతదేహం రాకకోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

లంగ్డాపూర్ గ్రామానికి శవ పేటిక అందజేత

బోధన్ రూరల్, డిసెంబరు 31 : బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రా మంలో ఆదివారం గ్రామస్థుల సహాయార్థం శవపేటికను అందజే శారు. గ్రామానికి చెందిన రాణంపల్లి రవి దాత తన తండ్రి దివంగత రాములు జ్ఞాపకార్థం శవపేటికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పవన్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, గంగాధర్, సుధాకర్, శ్రీనివాస్ పటేల్, సుంకరి లక్ష్మణ్, ఆనంద్ పటేల్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు


గాయపడిన శ్రీరాం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 31: సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా గాలిపటం ఎగరవేస్తున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన ఆదివారం నిజామాబాద్ నగరంలో జరిగింది. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన శ్రీరాం (9) తన ఇంటిపై గాలిపటం ఎగరవేస్తుండగా అది విద్యుత్ వైర్లకు తగలడంతో దానిని అందుకునే క్రమంలో ప్రమాదవశాత్తు శ్రీరాం విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన జరిగిన అనంతరం బంధువులు బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని డాక్టర్లు చెప్పడంతో బాలుడిని హైదరాబాద్‌కు తరలించారు. 60శాతంకు పైగా బాలుడికి కాలిన గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. తమ ఇంటికి సమీపంలో విద్యుత్ వైర్లు ఉన్నాయని వాటిని తొలగించాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా తొలగించలేదని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు బాలుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

చికిత్స పొందుతూ రాజు మృతి

మోపాల్, డిసెంబరు 31: కన్న కూతురు పెళ్లికి భార్య చెప్పలేదని మనస్థాపంతో భర్త రాజు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే.ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు ఆదివారం మరణించినట్లు మోపాల్ పోలీసులు తెలిపారు.

ప్రహసనంగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ

● ఆగస్టులో కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం ... తాజాగా మళ్లీ ప్రారంభించిన సీఎం రేవంత్
● నెలల వ్యవధిలో రెండు సార్లు ఆర్భాటంగా కార్యక్రమం ● అయినా విద్యార్థులకు అందని ల్యాప్‌టాప్‌లు
● ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం యూనివర్సిటీ అధికారుల పాకులాట

బాసర, డిసెంబరు 31:నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు లాప్‌టాప్‌ల పంపిణీ ప్రహసనంగా మారింది. ల్యాప్‌టాప్‌ల పంపిణీని వరుసగా ఆర్భాటంగా ప్రారంభింపజేస్తున్నా అధికారులు వాటిని మాత్రం విద్యార్థులకు అందివ్వకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఒకేసారి కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లలను మొదట మంత్రి కేటీఆర్‌తో పంపిణీని ప్రారంభించడం తాజాగా మళ్లీ ఆ ల్యాప్‌టాప్‌లనే ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డితో ఆర్భాటంగా పంపిణీని చేయించడం అధికారుల తీ రుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పెద్ద మెప్పు కోసమే అధికా రులు ఈ పని చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులకు అందించేందుకు ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో 1500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారు. ఈ కొత్త ల్యాప్‌టాప్‌లను ఆగస్టు నెలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ ప్రారంభోత్సవానికి వచ్చిన అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌చే ల్యాప్‌టాప్‌ల పంపిణీని యూనివర్సిటీ అధికారులు ప్రారంభించారు. కొంత మంది విద్యార్థులను నిజామాబాద్‌కు పిలిపించి ఆర్భాటంగా ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఇక విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందుతాయనుకున్నారు. కానీ రేపుమాపంటూ వాయిదా వేశారు. ఇంతలోనే ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఇక ప్రభుత్వంలో కొలువు దీరిన విద్యాశాఖ మంత్రిచే ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేయించా లని పెండింగ్‌లో ఉంచారు. విద్యార్థులకు లాప్‌టాప్‌లను అందివ్వలేదు. విద్యార్థులు, అధ్యాపకుల నుంచి అత్యవసరం ఏర్పడ్డా, ఒత్తిడి వచ్చినా కొనుగోలు చేసిన లాప్‌టాప్‌లను బయటకు తీయలేదు. తప్పని పరిస్థితులు ఎదురవడంతో గత ఏడాది చదువు పూర్తి చేసుకొని బయటకు వెళ్లిన విద్యార్థులు ఉపయోగించిన లాప్‌టాప్‌లను కొంత మందికి మాత్రమే అందించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా లాప్‌టాప్‌లు లేకుండానే మిగిలిన విద్యార్థులు తమ చదువును కొనసాగించారు. కొత్తవి వస్తాయనుకున్న విద్యార్థులకు నిరాశ ఎదురైంది.

● మళ్లీ రెండోసారి సీఎం రేవంత్ రెడ్డి చేతి మీదుగా..

శనివారం హైదరాబాద్‌లో ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని యూనివర్సిటీ అధికారులు ఏర్పాటు చేశారు. కొంత మంది విద్యార్థులను హైదరాబాద్‌కు పిలిపించుకొని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆరు నెలల కిందట కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లను రెండోసారి పంపిణీని చేయించారు. ఒకేసారి కొనుగోలు చే సిన ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు ఇవ్వకుండా భద్రపరుస్తూ పలుమార్లు ప్రభుత్వ పెద్దలతో ప్రారంభించేలా చేయడం యూనివర్సిటీ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పదవుల కోసం .. నేతల వద్ద పాట్లు..

గత ప్రభుత్వ హయంలో నియమితులైన నామినేట్ పోస్టుల్లో ఉన్న వారిని ఈ ప్రభుత్వం తొలగిస్తూ వస్తుంది. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌ను ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జీ వీసీగా గత ప్రభుత్వం నియమించింది. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌ను ఆ పదవి నుంచి తొలగించింది. ప్రస్తుతం వీసీకి ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జీ బాధ్యతలు మాత్రమే ఉన్నాయి. ఇక ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ పదవి కాలం కూడా కొన్ని నెలల క్రిందటే ముగిసింది. కొత్త ప్రభుత్వం యూనివర్సిటీ ఉన్నతమైన ఈ పోస్టుల్లో కొత్త వారిఇ నియమిస్తుందనే వార్తలు రావడంతో యూనివర్సిటీ అధికారులు అప్రమత్తమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో బీజీగా ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే లాప్‌టాప్‌ల పంపిణీని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. యూనివర్సిటీ తంతర్గత సమావేశాల్లో సైతం కొందరు యూనివర్సిటీ ఉన్నతాధికారులు కొత్త ప్రభుత్వ పెద్దలతో ఉన్న పరిచయాలను సైతం తరచుగా ప్రస్తావిస్తున్నారంటే వీరికి పదవులపై ఎంత ధ్యాస ఉందో అర్థమవుతుంది.


తాజాగా లాప్‌టాప్‌లను విద్యార్థులకు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


ఆగస్టు 9న నిజామాబాద్ ఐటీ హబ్‌లో విద్యార్థులకు లాప్‌టాప్‌లను అందజేస్తున్న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్

అప్పుడు కొనుగోలు చేసినవే..

● సతీష్ కుమార్, డైరెక్టర్

ఆగస్టు నెలకంటే ముందు కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లే శనివారం నాడు పంపిణీ చేపట్టాం. కాకపోతే విద్యార్థులు మారారు. ల్యాప్‌టాప్‌లు పాతవే అయినా ఆ నాడు ప్రస్తుతం ఇంజనీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థులకు పంపిణీ చేశాం. తాజాగా ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పంపిణీ ప్రారంభించాం. కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లన్నింటిని త్వరలోనే అందరికి అందిస్తాం.

అంబార్‌పేటలో బోరుబావి పనులు



అంబార్‌పేటలో బోరుబావి తవ్వకం పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

దోమకొండ, డిసెంబరు 31:మండలంలోని అంబార్‌పేట గ్రామంలో ఎంపీటీసీ నిధుల నుంచి బోరుబావి తవ్వకం పనులను ఆదివారం ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్ ప్రారంభించారు. గ్రామంలో కెనార బ్యాంక్ సమీపంలో బోరు బావి తవ్వకం పనులు చేపట్టినట్లు ఎంపీటీసీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సలీం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

సదాశివనగర్,డిసెంబరు 31: సదాశివనగర్ మండల కేంద్రంలో వైభవంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి ఐదులక్షలను ఆదివారం విరాళంగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి జీవితంలో కొంత సమయం భగవంతుని సేవ ప్రజాసేవలో వినియోగిస్తే జన్మ సార్థకతమవుతోందని తెలిపారు. తనవంతు సహయంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం సంతోషాన్నిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి హోటల్‌రాజు, గంగారెడ్డి, రవిరెడ్డి, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నగదు,సెల్‌ఫోన్ అందజేత



బాధితకుటుంబీకులకు నగదు,సెల్‌ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్ లక్ష్మన్

కామారెడ్డిటౌన్,డిసెంబరు 31: గాంధారి మండలం తిప్పారం రోడ్డువద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి కర్రోలా రవి కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన స్పృహలో లేకపోవడంతో అతని వద్ద ఉన్న నగదురూ.72వేల620లతో పాటు సెల్‌ఫోన్‌ను ఆయన కుటుంబీకులకు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మన్ అందించారు.

దోమకొండ వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

దోమకొండ, డిసెంబరు 31:మండల కేంద్రంలో వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల రాజేష్, కార్యదర్శి లింగ శ్రీకాంత్, కోశాధికారి రేఖ నవీన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గజవాడ శ్రీకాంత్, రవి, ప్రశాంత్, శ్రీధర్, శ్రీకాంత్, వెంకన్న, సంతోష్, సురేష్, శ్రీను, లక్ష్మణ్, ఎర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ వాసవి క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు

మాజీ ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- ఇసుక, మొరం అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- బరంగేడ్గిలో 15 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్
- బీర్కూర్, బరంగేడ్గి మంజీరా నదిలో ట్రెంచ్‌ల ఏర్పాటు

బీర్కూర్, డిసెంబరు 31 : బీర్కూర్ మండలంలో గత కొన్నాళ్లుగా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా, మొరం తవ్వకాలు జరుగుతున్నాయి.ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై కేసులు బనాయించి బెదిరించేవారు. ఇదే విషయమై బీర్కూర్ మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఇటీవల సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఇసుక, మొరం తవ్వకాలు, రవాణా చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ జనార్ధన్, ఎస్సై నర్సింలుతో కలిసి బీర్కూర్, కిష్టాపూర్, బరంగేడ్గి, దామరంచ గ్రామాలలో ట్రాక్టర్లు, టిప్పర్‌ల యజమానులు, డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను, టిప్పర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో ఇసుక, మొరం అక్రమ తవ్వకాలు, రవాణా తగ్గు ముఖం పట్టింది.

● బరంగేడ్గిలో 15 ట్రాక్టర్ ఇసుక డంప్ సీజ్..

బీర్కూర్ మండలంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా బరంగేడ్గి గ్రామ శివారులోని రహస్య ప్రదేశంలో ఇసుక డంప్‌లు ఉన్నాయని, కొందరు అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు తహసీల్దార్ జనార్ధన్ తన సిబ్బంది, పోలీసు సిబ్బందితో కలిసి బరంగేడ్గికి చేరుకున్నారు. రహస్య ప్రదేశంలో డంప్ చేసి ఉంచిన ఇసుక నిల్వలను గుర్తించారు. ఎవరూ డంప్ చేసి ఉంచారని ఆరాతీశారు. చివరకు ఇసుక డంప్‌కు పంచనామా నిర్వహించారు. 15 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్ చేసినట్లు తహసీల్దార్ జనార్ధన్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బీర్కూర్ మంజీరా నదిలోకి వెళ్లే దారికి అడ్డంగా తవ్వించిన గుంతలు

● మంజీరా నదిలో ట్రెంచ్‌ల ఏర్పాటు

బీర్కూర్ మండలంలో గత కొన్నాళ్లుగా ఇసుక అక్రమ రవాణా యధేచ్చగా కొనసాగుతుంది. గత కొన్నాళ్లుగా మండల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ప్రజలు ఇసుక అక్రమ రవాణాపై నియోజకవర్గ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. రవీందర్‌రెడ్డి ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈమేరకు తహసీల్దార్ జనార్ధన్ తమ సిబ్బందితో కలిసి బీర్కూర్, బరంగేడ్గి గ్రామాలలో పర్యటించారు. మంజీరా నదిలోకి ట్రాక్టర్లు, టిప్పర్లు వెళ్లకుండా నదిలోకి వెళ్లే దారికి అడ్డంగా ట్రెంచ్‌లు కొట్టించారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ట్రాక్టర్లల నుంచి డీజిల్ చోరీ



కిష్టాపూర్‌లో ఈ ట్రాక్టర్ ట్యాంక్ నుంచి డీజిల్ దొంగిలించిన దృశ్యం

బీర్కూర్, డిసెంబరు 31 : బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్, చించోల్లి గ్రామాలలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ల డీజిల్ ట్యాంక్‌ల నుంచి డీజిల్ దొంగిలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో గత కొన్ని రోజులుగా వ్యవసాయ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కిష్టాపూర్, చించోల్లి గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్లతో పొలాల్లో దుక్కి, దమ్ము పనులు చేస్తున్నారు. రాత్రివేళల్లో ట్రాక్టర్లను పొలాల వద్దే ఉంచి డ్రైవర్లు ఇంటికి వచ్చేస్తున్నారు. ఉదయాన్నే లేచి పొలాలకు వెళ్లి ట్రాక్టర్‌లతో పనులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు పొలాల వద్ద ఉన్న ట్రాక్టర్ల డిజిల్ ట్యాంకులను పగులకొట్టి డిజిల్ దొంగిలించారు. ఇలా కిష్టాపూర్‌లో 8 ట్రాక్టర్లు, చించోల్లిలో రెండు ట్రాక్టర్లు మొత్తం 10 ట్రాక్టర్ల డిజిల్ ట్యాంకులను పగులగొట్టి సుమారు 40 వేల రూపాయల విలువైన 400ల లీటర్ల డిజిల్ చోరీకి గురైందని ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి డిజిల్ దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

రాజంపేట,డిసెంబరు 31:రాజంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామంలో గ్రామస్థులు ప్రభుత్వ భూమి కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 566 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందినసర్పంచ్ విఠల్‌రెడ్డి కబ్జా చేసినట్లు ఆరోపించారు. డంపింగ్‌యార్డు,కోతుల ఆహారశాల,వడ్లకల్లం, క్రీడా ప్రాంగణం గ్రామఅవసరాలను ఉపయోగించబడిన గ్రామ ప్రజలందరు తీర్మానించిన ప్రభుత్వభూమిని సర్పంచ్ కబ్జాచేయడం సిగ్గుచేటని జిల్లా ఉన్నతాధికారులు సర్వేచేసి కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు సర్పంచ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వీడీసీ కమిటి సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్‌లో రామయ్య అక్షింతలతో శోభాయాత్ర



బైరాపూర్‌లో అయోధ్య రామయ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, డిసెంబరు 31 : అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల అయోధ్య రామయ్య అక్షింతలు బీర్కూర్ మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఆ అక్షింతలను స్థానిక రామాలయంలో భద్రపరిచారు. ఇదిలా ఉండగా ఆదివారం బీర్కూర్ మండలంలోని అన్ని గ్రామాలకు ఆ అక్షింతలను పంపిణీ చేశారు. అయితే బైరాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో శ్రీముని భక్తులు అక్షింతలు కలిగిన కలశం తలపై పెట్టుకుని ఆయా గ్రామాల్లో భారీ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భాజా భజంత్రీల మధ్య కాషాయ జెండాలను చేత పట్టుకుని జై శ్రీరాం అంటూ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం తమ తమ గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో అక్షింత లను భద్రపరిచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు భాజా ప్రసాద్, రాజు, వెంకట్‌రావు, గణేష్, సంతోష్, సాయి కిరణ్, శ్రీకాంత్, కోదండ రామాలయ కమిటీ సభ్యు లు మేకల విఠల్, ప్రవీణ్, రాజు, శ్రీనివాస్, బాలయ్య, మండలంలోని అన్ని గ్రామాల అయోధ్య తీర్థ క్షేత్రట్రస్ట్ ప్రతినిధులు, భక్తు లు తదిత రులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



బీర్కూర్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, డిసెంబరు 31: ఆంగ్ల నూతన సంవత్సర సంబరాల కోసం యువత ఏర్పాట్లను పూర్తి చేసుకుంది. ఆదివారం రాత్రి వేళలో తమతమ మిత్రులతో సంబరాలు జరుపుకునేందుకు ఏర్పాట్లను చేసుకున్నారు. బేకరీ , హోటల్ , బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు కూడా కొత్త సంవత్సర వేడుకల కోసం ఆఫర్లను ప్రకటించారు. దీంతో బేకరీ , హోటళ్లలో సందడి నెలకొంది. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యువత సన్నాహాలు చేసుకుంది.

బీర్కూర్: మండల వ్యాప్తంగా ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా జరు పుకున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం ఆర్య వైశ్య మహిళలు తమ సంఘం భవ నంలో పిల్లలు, పెద్దలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఆటాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమ తులను ప్రధానం చేశారు. అనంతరం పాత సంవత్సరా నికి బైబై చెబుతూ కొత్తసంవత్సరానికి స్వాగతం పలుకుతూ న్యూఇయర్ వేడుకలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

కన్నబిడ్డను మంటల్లోకి నెట్టిన కసాయి తండ్రి

● స్వల్ప గాయాలతో బయటపడ్డ చిన్నారి

బీర్కూర్, డిసెంబరు 31 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో ఒక కసాయి తండ్రి తన కన్న కూతురును మంటల్లోకి నెట్టాడు. పక్కనే ఉన్న వారు వెంటనే స్పందించి ఆ పాపను కాపాడారు. అదృష్టవశాత్తు ఆ చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది. ప్రస్తుతం ఆ అమ్మాయి సురక్షితంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన దేశాయిపేట్ సాయిలుకు ఏడేళ్ల వయసు గల అంకిత అనే కుమార్తె ఉంది. ఇటీవల చలి తీవ్రత బాగా పెరిగింది. అయితే ఆదివారం అంకిత ఇంటి పక్కనే తోటి పిల్లలతో కలిసి చలి మంటలు కాపుకుంటుంది. ఇదిలా ఉండగా పిల్లలు చలి మంటలు కాపుకుంటున్న సమయంలో పక్కనే ఉన్న గడ్డి వాముకు నిప్పు అంటుకుంది. గడ్డివాము యజమాని కొట్టాల గంగాధర్ మంటలు ఆర్పడానికి ప్రయత్నించాడు. అయినా గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. దీంతో దేశాయిపేట్ సాయిలుతో గంగాధర్ గొడవకు దిగాడు. మీ బిడ్డ అంకితనే గడ్డివాముకు నిప్పు పెట్టిందంటూ ఆరోపించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ పెరిగి పెద్దదైంది. కోపోద్రిక్తుడైన సాయిలు తన కుమార్తె అంకితను మంటల్లోకి తోశాడు. వెంటనే కొట్టెం గంగాధర్ స్పందించి మంటల్లో పడిన అంకితను బయటకు తీసి రక్షించాడు. ఈ ఘటనలో అంకితకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే బీర్కూర్ పీహెచ్‌సీకి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. ప్రస్తుతం అంకిత బాగుంది. సాయిలు మద్యం మత్తులో తన కుమార్తెను మంటలోకి తోశాడని స్థానికులు తెలిపారు. గ్రామంలో బెల్టుషాపులు మూలంగా మద్యం విచ్చలవిడిగా లభిస్తోందని దీంతో యువత, ప్రజలు మద్యానికి బానిసై ఇలాంటి ఘాతకానికి పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి బెల్టు షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మద్యం విక్రయాలను కట్టడిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



అంబులెన్స్‌లో అంకితను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

6న దోమకొండ కోటలో కూచిపూడి నృత్యం



గడికోటలో కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

దోమకొండ, డిసెంబరు 31: మండల కేంద్రంలోని గడికోటలో 6న దోమకొండ చిన్నారులచే కూచిపూడి నృత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు ఆదివారం తెలిపారు. గత 5 నెలల నుండి ప్రతి ఆదివారం కోటలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షకురాళ్లు హిమబింధు, సభ్యులు సోనా, మోఘన, ఉజ్వల హరి ఆదివారం చిన్నారులకు నూతన స్టెప్పును శిక్షణలో ప్రారంభించారు. 6న జరిగే కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి పలువురు హజరు కానున్నట్లు తెలిపారు.

బదిలీపై వెళ్లిన వైద్యాధికారి



సంగీత్ కుమార్

దోమకొండ, డిసెంబరు 31: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారిగా బి. సంగీత్ కుమార్ గత ఐదున్నర సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. కాగా ఆయన పదోన్నతిపై కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి సీహెచ్‌సీకి డిప్యూటి సివిల్ సర్జన్‌గా వెళ్లారు. ఆయనకు జిల్లా వైద్యాధికారిణి విజయలక్ష్మీ పదోన్నతి బదీలి పత్రాన్ని జిల్లా ఆసుపత్రిలో అందజేశారు.దోమకొండ సీహెచ్‌సీకి కామారెడ్డి జిల్లా ఆసుపత్రి నుంచి యు.వెంకటేశ్వర్లు డిప్యూటి సివిల్ సర్జన్ రావడం జరిగింది.

నేడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ

సదాశివనగర్,డిసెంబరు 31: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద సోమవారం మహాపడి పూజ నిర్వహించడం జరుగుతుందని గురుస్వామి రాజు తెలిపారు.భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి పడిపూజ విజయవంతం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

మొక్కజొన్నలో చీడ పీడలు - నివారణ చర్యలు



పంట చేనులో సాగు చేస్తున్న మొక్క జొన్న పంట

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 31: జుక్కల్ నియోజక వర్గ వ్యాప్తంగా రబీ సీజన్‌కు గాను రైతన్నలు వరి తర్వాత నాన్‌కమాండింగ్ ఏరియాలో మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో పండించే పంటలలో మొక్క జొన్న పంటకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ సారి రబీ సీజన్‌లో సుమారు 5 వేల 9 వందల 92 ఎకరాలలో మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. ఇందులో బిచ్కుంద మండలంలో 940 ఎకరాలు, జుక్కల్ 398, మద్నూర్ 2540. పిట్లం 1230, పెద్ద కొడప్‌గల్ 998 ఎకరాలలో మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట సాగు చేసిన వారు కొందరైతే, ఇంక మరి కొంత మంది రైతన్నలు మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం మొక్క జొన్న పంటకు కత్తెర పురుగు ఆశించి రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కత్తెర పురుగుతో పాటు, పేనుబంక, కాండం ఆశించే తెగులు వస్తున్నాయని వీటిని రైతన్నలు సకాలంలో గుర్తించి పంటను కాపాడు కోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

● కత్తెర పురుగు లక్షణాలు- నివారణ చర్యలు

మొక్క జొన్న పంట సాగు చేసిన వారం రోజుల లోపు కత్తెర పురుగు పంటను ఆశిస్తోందని చిన్న మొలకలు కాగానే కత్తెర పురుగును ఆశించే కీటకం ఆకుల మధ్యలో గుడ్లు పెడుతుందని, సరియైన సమయంలో రైతులు దీనిని గుర్తించకపోతే ఆకులను తిని వేసి కాండం మాత్రమే మిగులుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీని నివారణకు గాను నీమాయిల్ స్ప్రే చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇక మొక్క జొన్న పంట 11 -15 రోజుల సమయంలో ఇదే కత్తెర పురుగు ఆశించి ఆకులను తిని వేస్తుందని, దీని నివారణకు గాను యామామెక్టిన్ బెంజోమెట్ ఎకరాకు 80 నుండి 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అనంతరం మొక్క జొన్న 20 నుండి 25 రోజుల దశ రాగానే మరొక్క సారి డెటిగేట్ లేదా స్పైనోస్యాడ్ పిచికారి చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో పాటు గానే క త్తెర పురుగు ఆశించకుండ మార్కెట్లో దొరికే లింగాకర్షక బుట్టలు ఎకరానికి 5 నుండి 6 ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.



మొక్క జొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు

● పేనుబంక లక్షణాలు- నివారణ చర్యలు

మొక్క జొన్నలో కత్తెర పురుగుతో పాటు పేనుబంక కూడ ప్రదానమైనదని ఈ చీడ మొక్కజొన్న వేసిన 45 రోజుల తర్వాత వస్తుందని, మొక్క జొన్న ఆకుల నుండి తేనే మాదిరిగా కారుతుందని, దీని నివారణకు గాను ఎకరాకు 200 గ్రాములు అసిటంప్రైడ్ 2 వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచిస్తున్నారు.

● కాండం తొలిచే పురుగు లక్షణాలు-నివారణ చర్యలు

మొక్క జొన్న పంట సాగు చేసిన 21 రోజుల నుండి మొక్క జొన్న కంకి తయారయ్యే దశ వరకు కాండం తొలిచే పురుగు వ్యాపిస్తుందని,దీంతో కాండంకు పురుగు వ్యాపించడం వలన కాండం పూర్తిగా బలం లేకుండా తయారయి బలమైన గాలులు వీస్తున్న పుడు నేల కొరుగుతుందని తెలిపారు. దీని నివారణకు గాను కొరాజిన్ 60 ఎంల్ 2 వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

పంట ఎదుగుతున్న క్రమంలో రైతులు దృష్టిసారించాలి



రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలలో మొక్క జొన్న పంట ప్రదానమైనది. ఈ పంట సాగు చేయడం ఎంత సులువో, చీడ పీడలు కూడ అంతే వ్యాపిస్తాయి.పంట ఎదుగుదల చేస్తున్న క్రమంలో పంటపై రైతులు దృష్టి సారించి రైతులు పంటలకు ఏమైనా చీడపీడలు వ్యాపిస్తున్నట్లు తెలియగానే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని పంటను కాపాడుకోవాలి.

-నదీం వ్యవసాయాధికారి పెద్ద కొడప్‌గల్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
ప్రియా 35	సలార్
దర్శన్	ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్
శాంతి	అక్వామెన్ అండ్ ది లాస్ట్ కింగ్‌డమ్
ప్రియా 70	హాయ్‌నాన్న

బాన్సువాడ	
వెంకటేశ్వర	--
మహేశ్వరి	సలార్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

